క్లుప్తంగా

రెండు కిలోల గంజాయి పట్టివేత



కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో రెండు కిలోల గంజాయిని పట్టుకుని ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పల్‌లో బుధవారం స్థానిక ఎస్సై వీరభద్రరావు పోలీసు సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో ఉప్పల్ బస్టాండ్ వద్ద నర్సంపేటకు చెందిన మంతోజు స్వరూప (50), ఉప్పల్‌కు చెందిన ఎండీ.షమీమ్ (45) అనే ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. వారి వద్ద రెండు కిలోల ఎండు గంజాయి లభించినట్లు తెలిపారు. ఇద్దరు మహిళలు కూడా గతంలో గంజాయి సరఫరా చేస్తూ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లారని, స్వరూపపై నర్సంపేట, హనుమకొండ, వరంగల్ జీఆర్‌పీ పోలీస్ స్టేషన్లలో, షమీమ్‌పై పరకాల, జమ్మికుంట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదైనట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. షమీమ్‌ను గత నెలలో జమ్మికుంట ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేయగా వారం రోజుల క్రితమే బయటకు వచ్చి సులభంగా డబ్బులు సంపాదించాలని మళ్లీ గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయితో పాటు రూ.17,900 నగదు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చెట్టుకొమ్మల తొలగింపు



శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో చెట్టు కొమ్మలకు విద్యుత్ తీగలు ఆనుకొని ప్రమాదకరంగా కనిపించాయి. దీంతో బుధవారం సాక్షి దిన పత్రిలో 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో విద్యుత్ శాఖ ఏఈ రాజ్‌కుమార్ సిబ్బందితో కలిసి చెట్టుకొమ్మలను తొలగించారు. గ్రామాల్లో విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

సాక్షి స్పందన

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

వేలేరు : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని బుధవారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. నాయకులు చంద్రమౌళి, శ్రీనివాస్, సునిల్, శ్రవణ్, అనిల్, నాగరాజు పాల్గొన్నారు.

పత్తిపంట క్షేత్రపదర్శన

ఎల్కతుర్తి : మండలంలోని జీల్గుల గ్రామంలో కేంద్ర పత్తి పరిశోధన సంస్థ, కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట, రాశి పత్తి విత్తన సంస్థ ఆధ్వర్యంలో అధిక సాంద్రత పద్ధతి సాగుపై క్షేత్ర స్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ పద్ధతిలో పత్తి సాగు చేసినప్పుడు వరుసలు, మొక్కల మధ్య దూరం తక్కువగా ఉండడం వలన మొక్కల సంఖ్య ఎక్కువగా ఉంటుందన్నారు. మొక్కలకు 8 నుంచి 12 కాయలు ఉండి ఎక్కువ మొక్కలు ఉడండడం వలన అధిక దిగుబడి వస్తుందని కేవీకే యంగ్ ప్రొఫెషినల్ ఆర్.రాజేశ్ రైతులకు వివరించారు. రాజేశ్, విష్ణు, రాశి సీడ్స్ జిల్లా ప్రతినిధి రమణారెడ్డి, ప్రవీణ్‌కుమార్, హరీశ్ రైతులు పాల్గొన్నారు.

రవాణాకు అంతరాయం

నడికూడ : మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో కంఠాత్మకూరు వాగు వద్ద వరద ఉధృతి పెరిగింది. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో పరకాల–అంబాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు.

క్రషర్ యజమానులు నిబంధనలు పాటించాలి

వేలేరు : క్రషర్ యజమానులు నిబంధనలు పాటించాలని తహసీల్దార్ కోమి, మైనింగ్ ఆర్ఐ చంద్రకళ అన్నారు. బుధవారం మండలంలోని పీచర, వేలేరు, కమ్మరిపేట గ్రామాల్లో గల స్టోన్ క్రషర్‌లను మైనింగ్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు క్రషర్‌ల అనుమతి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన అనుమతుల మేరకే తవ్వకాలు చేపట్టాలని, క్రషర్‌ల చుట్టుపక్కల పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి కాపాడాలని అన్నారు. ఇతర నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. నిబంధనల మేరకు మాత్రమే తవ్వకాలు చేపట్టాని, నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



శాయంపేట : పోషకాల గురించి వివరిస్తున్న డాక్టర్ సాయికృష్ణ



దామెర : వెల్‌బేబీషోలో గెలుపొందిన శిశువుకు బహుమతి అందిస్తున్న ఎస్సై అశోక్

- డాక్టర్ సాయికృష్ణ, ఎస్సై అశోక్
- అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాసం
- గర్భిణులకు పలు సూచనలు చేసిన ఐసీడీఎస్ అధికారులు

శాయంపేట : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు సాయికృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సూపర్‌వైజ్డ్ సప్లమెంటరీ ఫీడింగ్ ప్రోగ్రాంపై అవగాహన కల్పించారు. ప్రతిరోజు తీసుకునే ఆహారంలో పాలు, కోడిగుడ్లు, పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు, డ్రై ఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల ఎత్తు, బరువును పరిశీలించి వైద్యపరీక్షలు నిర్వహించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి వారికి అందించాల్సిన పోషకాల గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని తల్లులు, గర్భిణులు, పిల్లలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునితారెడ్డి, ఏఎన్ఎం శ్రావణి, అంగన్‌వాడీ టీచర్లు రత్నమాల, జ్యోత్స్న, శ్వేత, రమ, పుష్ప, అరుణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఎస్సై కొంక అశోక్ అన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు ల్యాదెళ్లలో బుధవారం అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు. సామూహిక సీమంతాలు, వెల్ బేబీ షో నిర్వహించి గెలుపొందిన శిశువులకు బహుమతులు ప్రదానం చేసి పలు సూచనలు చేశారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : ప్రతిరోజు పిల్లలకు పోషకాహారం అందిస్తేనే ఆరోగ్యంగా జీవిస్తారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నర్సింగ్ అన్నారు. మండలంలోని గుడెపాడ్ గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో బుధవారం సూపర్‌వైజ్డ్ సప్లమెంటరీ ఫీడింగ్ ప్రోగ్రామ్‌పై అవగాహన కల్పించారు. శ్రీలత, ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



పరకాల : విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న అధికారులు



దామెర : స్వచ్ఛతహీలో పాల్గొన్న అధికారులు

పరకాల : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండలస్థాయి క్రీడా పోటీలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నర్సింహ, ఎస్సై రమేష్, ఎంఈఓ రమాదేవి, మండల క్రీడా కార్యదర్శి కవితతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు మండల స్థాయిలో గెలిచిన విద్యార్థులకు మంచి శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లా స్థాయిలో అత్యధిక బహుమతులు గెలుపొందేలా ప్రోత్సహించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, మధుకర్, సురేందర్, గౌస్‌పాషాతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దామెర : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి క్రీడలు ఆడారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతహీ సేవా కార్యక్రమం కొనసాగనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థులకు క్రీడలు నిర్వహించి స్వచ్ఛతాపై అవగాహన కల్పించారు. ఎంఈఓ రాజేష్ కుమార్, ఎంపీఓ రాంగాచారి, ఏపీఓ శారద, కార్యదర్శులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నామినీలకు బీమా డబ్బుల అందజేత



బీమా డబ్బులు అందజేస్తున్న సంఘం సభ్యులు

ఐనవోలు : మండలంలోని వెంకటాపురం గ్రామంలో గల శ్రీషిరిడీ సాయి, సత్యసాయి పురుషుల పొదుపు సంఘాలకు చెందిన సభ్యులు డోబిల సంపత్, బండి శ్రీను ఇటీవల మృతిచెందారు. అయితే వారు పొదుపు సంఘంలో సభ్యత్వం పొంది ఉన్నారు. దీంతో మృతిచెందిన సంఘ సభ్యుల నామినీలకు సంఘం అధ్యక్షుడు రూ. 70వేల చొప్పున బీమా డబ్బులను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా పలువురు కృతజ్ఞతలు తెలిపారు. సమితి అధ్యక్షుడు మండల సుదర్శన్ రెడ్డి, సంఘం అధ్యక్షుడు కాత వీరస్వామి, మేకిరి రమేష్, పాలకర్గ సభ్యులు పాల్గొన్నారు.

మేలుకొలుపు యాత్రను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఉపేందర్

ధర్మసాగర్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో అక్టోబర్ 01న నిర్వహించనున్న మాదిగల మేలుకొలుపు యాత్రను జయప్రదం చేయాలని ఎంహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్‌మాదిగ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో మాదిగల మేలుకొలుపు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి దానికి అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టి జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు .ఈ సమావేశంలో ఎంహెచ్‌పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలి



పూజలు నిర్వహిస్తున్న నరేందర్

ఎల్కతుర్తి : ఆశీర్వదించి ఎమ్మెల్సీగా గెలిపిస్తే ప్రజాసేవ చేస్తానని అల్‌ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ఊట్కూరి నరేందర్ అన్నారు. బుధవారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామిని దర్శించుకోగా ఆలయ ఈఓ కిషన్‌రావు ఆధ్వర్యంలో మొక్కులు చెల్లించారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పరిధిలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వీరభద్రుడి సాక్షిగా తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే కొత్తకొండలో ఆధునిక లైబ్రరీ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. పట్టభద్రులు తనను గెలిపించాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి ఊహ(28) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కొకొండ గ్రామానికి చెందిన ఊహ గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి సురేష్‌తో ఏడేళ్ల క్రితం వివాహం కాగా వారికి పాప అణన్య, బాబు చింటు ఉన్నారు. భర్త సురేష్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఊహ పిల్లలతో కలిసి గట్లకానిపర్తి గ్రామంలోని అత్తమామలతో కలిసి ఉంటుంది. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కూలి పనులకు వెళ్లిన అత్తమామలు ఇంటికి వచ్చి చూసే సరికి దూలానికి వేలాడుతూ కనిపించింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

సైకిల్‌ను ఢీకొట్టిన ఆటో

ఐనవోలు : సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండేటి సదానందం బుధవారం రాత్రి సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ సంఘటనలో సదానందం తలకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు 108 వాహనానికి సమచారం అందించడంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. 108 సిబ్బంది ఈఎంటీఆర్ సోమేశ్వర్, పైలెట్ భాస్కర్‌రెడ్డి ప్రథమ చికిత్స నందించారు. కాగా ఇటీవల ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా మరో ఇద్దరు ప్రమాదానికి గురయ్యారు. గ్రామంలో ఇష్టారీతిన ఆటోలు నడుపుతున్నారని స్థానిక పోలీస్‌లు దృష్టిసారించాల పలువురు కోరుతున్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న సారయ్య

శాయంపేట : పుస్తక పఠనాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని స్థానిక ప్రభుత్వ పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సారయ్య అన్నారు. మండలంలోని పెద్దకోడెపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పెద్దకోడెపాక, పత్తిపాక పాఠశాలల నుంచి 22 మంది ఉపాధ్యాయులు హాజరు కాగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పర్యవేక్షణలో ఎఫ్ఎల్ఎన్ అమలు తీరు, ఎన్ఏఎస్ మాక్ టెస్ట్, తరగతి విషయాల అభ్యాసన ఫలితాలపై చర్చించారు. మాదిరి పాఠ్యాంశ బోధన, బోధనోపకరణాల ఉపయోగం, చదివే సామర్థ్యం పెంపొందించే ప్రక్రియలో లైబ్రరీ యొక్క పాత్రను విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల సముదాయ నిర్వహణ ఎజెండా, ప్రశస్త యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ కాంప్లెక్స్ సెక్రటరీ లక్ష్మీనారాయణ. సీఆర్పీ వంశీ, ఆర్పీలు శ్రీధర్, రఘు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ స్టడీస్ ల్యాబ్‌ను వినియోగించుకోవాలి

- జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్
- ఊరుగొండ ప్రభుత్వ పాఠశాలలో ల్యాబ్ ప్రారంభం



సోషల్ స్టడీస్ ల్యాబ్‌లో పరికరాల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయుడు డాక్టర్ ఆర్.గణపతి

దామెర : విద్యార్థులు సోషల్ స్టడీస్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని (ఏఎంఓ) జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని ఊరుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ రాచర్ల గణపతి సేకరించిన నాణేలు, బోధనాభ్యసన పరికరాలు, విద్యార్థులు తయారుచేసిన అభ్యసన సామగ్రితో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను ఏఎంఓ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ల్యాబ్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. భూమి అంతర్గత నిర్మాణం, రాత్రులు, పగలు ఏర్పడే విధానం, వాతావరణం, ఆవరణముల విస్తరణ, జలచక్రం ఏర్పడే విధానం, భూకంపం సంభవించు పరిస్థితులు– నమూనాలు, వర్కింగ్ మోడల్స్, సాంఘికశాస్త్ర అధ్యయన సామగ్రి విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి దోహదపడుతుందని ఉపాధ్యాయుడు గణపతి పేర్కొన్నారు. జిగ్‌సా ఫజిల్ ద్వారా ప్రపంచ దేశాలు, భారతదేశంలోని రాష్ట్రాలను గుర్తించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రాజేశ్‌కుమార్, ఎంఎన్ఓ జుమ్మునాయక్, ఊరుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అనిత, విజయప్రభ, స్వరూపారాణి, వసుంధరాదేవి, సౌజన్య, లక్ష్మీనారాయణ, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, సురేందర్, పీడీ లక్ష్మీనారాయణ, సీఆర్పీలు నరేశ్, రాజు పాల్గొన్నారు.


సంక్షిప్తంగా

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి



హన్మకొండ : తనను వేధిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని జిల్లాలోని కమలాపూర్ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) జూనియర్ అసిస్టెంట్ శారద కోరారు. ఈ మేరకు బుధవారం హనుమకొండలోని జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. ప్రధానోపాధ్యాయుడు మీస రాజమల్లయ్య తనను మానసిక వేధింపులకు గురి చేస్తున్నాడని, విధులు నిర్వహించకుండా ఆటంకాలు సృష్టిస్తున్నాడని, ఇతరులతో పనులు చేయిస్తూ అవమానపరుస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫోన్‌లో స్పందించకుంటే ఇంటికి రావాలని వేధిస్తున్నాడని ఫిర్యాదులో తెలిపారు. వేసవి సెలవుల్లో తనకు రావాల్సిన సెలవులను తనకు జమచేయకుండా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఇతరులకు జమ చేస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

వేలంతో లభించిన ఆదాయం



పరకాల : ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాటుసారా కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు వేలం వేయగా రూ.3లక్షల67వేల 84ల ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. బుధవారం పరకాల ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారుల సమక్షంలో 16 ద్విచక్ర వాహనాలకు ఎంవీఐ నిర్ణయించిన ప్రకారం రూ.1లక్ష 95వేలు కాగా రూ.1లక్ష73వేల 84లు అదనపు ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

ఎంఈఓగా రాజేష్‌కుమార్



రాజేష్‌కుమార్

దామెర : మండల విద్యాధికారి (ఎంఈఓ)గా లకావత్ రాజేష్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దామెర ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయనకు బాధ్యతలు అప్పగించారు. మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

ఐనవోలు ఎంఈఓగా ఆనందం..



ఐనవోలు : మండలంలోని పంథిని జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం పులి ఆనందంను మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)గా నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా పీఆర్టీయూ(టీఎస్) మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఈఓ ఆనందంకు శుభాకాంక్షలు తెలిపారు. పూలబొకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర, జిల్లా ఉపాధ్యక్షులు కొమురయ్య, మహిపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజు, ప్రధానకార్యదర్శి చంద్రమోహన్, సమ్మయ్య, ప్రశాంత్, కిషన్, యూసుఫ్‌పాషా, పంథిని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా గోవర్ధన్ ఎన్నిక

పరకాల : ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వేల్ఫేర్ అసోసియేషన్ పరకాల డిపో అధ్యక్షుడిగా లావుడ్యా గోవర్ధన్ ఎన్నికయ్యారు.

సభ్యత్వ నమోదులో అగ్రగామిగా నిలవాలి



కమలాపూర్ : సభ్యత్వాలు అందజేస్తున్న శ్రీరాంశ్యాం తదితరులు



వేలేరు : కమ్మరిపేటలో సభ్యత్వ నమోదు చేస్తున్న మాజీ మంత్రి విజయరామరావు



దామెర : ల్యాదెళ్లలో సభ్యత్వ నమోదు చేపడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

కమలాపూర్ : బీజేపీ సభ్యత్వ నమోదులో మండలాన్ని జిల్లాలోనే అగ్రగామిగా నిలపాలని సభ్యత్వ నమోదు మండల ఇన్‌చార్జ్, జమ్మికుంట మాజీ జెడ్పీటీసీ శ్రీరాం శ్యాం పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మండలాన్ని సందర్శించి బీజేపీ సభ్యత్వ నమోదును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సంక్షేమం, అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, అందుకే ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. బీజేపీలో చేరేందుకు అనేక మంది ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. సభ్యత్వ నమోదులో కమలాపూర్ మండలాన్ని జిల్లాలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు పార్టీ శ్రేణులంతా కష్టపడాలని ఆయన కోరారు. అంతకుముందు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ శోభన్‌బాబు, నాయకులు ప్రవీణ్, అరవింద్, కోటేశ్వర్, రాంబాబు, సతీష్, కుమారస్వామి, చైతన్య పాల్గొన్నారు.

దామెర : రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి అన్నారు. ల్యాదెళ్లలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. అనంతరం భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజు, ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్, బీసీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్, శక్తికేంద్రం ఇన్‌చార్జ్ శ్రీకాంత్, బూత్ అధ్యక్షుడు డెంగు నవీన్, పిడుగు అనిల్ యువమోర్చా కార్యవర్గ సభ్యుడు సుమంత్, సుధాకర్, చిరంజీవి, రోహిత్, విశ్వంత్, శ్రీనివాస్, గోశాల సాంబరాజు పాల్గొన్నారు.

ఆత్మకూరు : భారతీయ జనతా పార్టీ మూల పురుషుడు, జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం మండల కేంద్రంలో నిర్వహించారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంత్యోదయ విధానంలో సమాజంలోని అట్టడుగు వ్యక్తులకు ప్రభుత్వ ప్రథకాల్లో తొలి ప్రయోజనం చేకూరాలని మానవాళికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు దీన్‌దయాల్ ఉపాధ్యాయ అని కొనియాడారు.

వేలేరు : బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయ రామారావు అన్నారు. బీజేపీ నాయకులు చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి తిరుగుతూ సభ్యత్వాలు అందించారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, రాబోయే రోజుల్లో పార్టీలో కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. మండల అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ధర్మసాగర్ : వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను హనుమకొండలోని ఆమె నివాసంలో ధర్మసాగర్ మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి శరత్, కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా రోడ్లు, సైడ్‌డ్రెయినేజీల కోసం నిధులు కేటాయించాలని కోరారు. అదే విధంగా జాతీయ రహదారి (ఓఆర్ఆర్) వద్ద టేకులగూడెం నుంచి ధర్మసాగర్ వచ్చే సర్వీస్‌రోడ్డు, ఎల్కుర్తి నుంచి ధర్మసాగర్ వచ్చే సర్వీస్‌రోడ్డు కూడలికిరువైపుల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సంబధిత అధికారులతో మాట్లాడి స్పీడ్‌బ్రేకర్లు, లైటింగ్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎంపీని కలిసినవారిలో కొలిపాక రమేశ్, మర్రిపల్లి యాదగిరి, కొలిపాక మల్లికార్జున్, హఫీజ్ ఉన్నారు.